కథా నిలయం
3793
శ్రీకాకుళం

# మనుష్యులూ - బొద్దింకలూ

'ఈ ప్రపంచంలో అన్నిటికంటె అసహ్యాకరమైన జీవి ఏది?' అని యక్షుడు ప్రశ్నించివుంటే ధర్మరాజు ఏమి సమాధాన మిచ్చివుండే వాడో నాకు తెలియదుగాని నన్నడిగితే తడుముకోకుండా 'బొద్దింక' అని చెప్పెయ్యగలను. ఈ వూరికి ట్రాన్స్‌ఫర్‌మీద వచ్చినప్పటినుండి నా మానసిక జీవితంలో బొద్దింక ప్రముఖస్థానాన్ని ఆక్రమించుకొన్నది. చీకటిపడ్డాక వంటగది తలుపు కాస్సేపువేస్తే తిరిగి వచ్చేసరికి గదినిండా వుంటాయి బొద్దింకలు - నున్నగా, ఓవల్‌గా, బిళ్లల్లాగా. వాటిని చూడ గానే 'ఛీ, ఛీ, ఎట్లా వున్నాయో; గదినిండా పరచిపెట్టిన బిళ్ళల్లాగా' అను కుంటాను. ఒళ్ళు జలదరిస్తుంది.

ఒకసారి ఎక్కడో ఒక వ్యాసం చదివాను వాటిగురించి – అవి కొద్దిపాటి ఆహారంతో ఎన్నాళ్ళయినా బ్రతగ్గలవనీ, దేన్నయినా తిని బ్రత గ్గలవనీ, అనేకానేక సంవత్సరాల తర్వాత మానవుడు భూమ్మీద లేకుండా పోయినప్పుడు మిగిలివుండేది బొద్దింకలేననీను! నేను లేకుండా పోయి నప్పుడు బొదింక లుంటాయి. తరువాత నన్ను కూడా తిని బ్రతుకుతాయి! ఇది చదివినప్పటినుండి వాటిమీది అసహ్యం మరింత పెరిగిపోయింది.

నేను లేకుండా పోయినప్పుడు వుండబోయే బొద్దింకలు, దేన్నయినా తిని బ్రతగ్గల బొద్దింకలు, అందరిచేతా అసహ్యించుకోబడే బొద్దింకలు!

వాటినిచూసి అసహ్యించుకోని వాళ్ళు వుంటారా అంటే ఒక్కొక్కళ్ళు వుంటారని స్వానుభవం మీద తెలిసింది. లేబర్ వెల్‌ఫేర్ ఆఫీసరుగా

ఆయన్ని యీ వూరు వేశారు క్రొత్తగా. ఇల్లు దొరగ్గానే నన్నూ మా పిల్లలు ముగ్గుర్నీ తీసుకొని వచ్చారు. ఆ రోజు రాత్రి యీ ఛండాలపు బొద్దింకల్ని చూచి, తిన్న అన్నమంతా వాంతి చేసుకొన్నాను. అసలే ప్రయాణపు బడలిక, అందులో యీ అసహ్యం భరించలేకపోయాను.

నేను డోక్కుంటుంటే ఆయనా పిల్లలూ ఆత్రంగా చుట్టూ చేరారు.

'ఏమిటి ? ఎందుకు ? ఏమయింది ?' అన్నారాయన కూర్చొని వున్న నా భుజాల్ని పట్టుకొని. 'చెంబుతో నీళ్ళు తీసుకురామ్మా' అన్నారు. శారద నీళ్ళు తెచ్చి అక్కడ పెట్టింది. కాస్త తెప్పరిల్లిన నేను చుట్టూ చూశాను. తొమ్మిదేళ్ళది శారద దూరంగా గోడకానుకొని నిలుచుండి నన్ను జాలిగా చూస్తూ పరిస్థితిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. దాన్ని చూస్తే ఎందుకో నాకు చీకాకు ముంచుకొస్తుంది.

'ఎందుకలా నిల్చున్నావ్ ? కిష్టుణ్ణి బకెట్‌తో నీళ్ళు తెమ్మను, ఫో' అని కసిరి పంపించేశాను.

మూడేళ్ళవాడు శాయిలుబాబు భయపడిపోయి నిలుచుని వున్నాడు. నేను తన దిక్కున చూడగానే 'అమ్మా' అని ఏడుస్తూ వచ్చి నన్ను చుట్టేసుకున్నాడు. 'నా దగ్గర ఛీ ఛీ వుందమ్మా. సీతక్క దగ్గరకు వెళ్ళు. యిప్పుడే వచ్చేస్తానుగా' అని వీపు తట్టి పంపించాను. సీత శాయిలుకంటే రెండేళ్ళు పెద్దది గనుక తన పెద్దరికాన్ని గుర్తుకు తెచ్చుకొని ఆత్రుత నణచుకొని 'రారా బాబూ' అన్నది. 'మీ రిద్దరూ బయటకువెళ్ళి ఆడుకోండి....నాకు బాగుందిగా' అన్నాను. వాళ్ళిద్దరూ సంతోషంగా బయటకు పరుగెత్తారు.

'ఈ యింట్లో నే నుండలేను. ఛీ ఛీ. ఎన్ని బొద్దింకలు ! వేరే యిల్లు చూడాల్సిందే' అన్నాను.

'బొద్దింకలేం చేస్తాయి! అవీ ప్రాణులేగా, అంత అసహ్యా మెందుకూ ?' అన్నారాయన సగం హాస్యంగా.

'అవును మరి, వాటిదగ్గరకు మీరు వెళ్ళనవసరంలేదు గనుక ఎన్ని కబుర్లయినా చెప్పొచ్చు. కాని యిన్ని బొద్దింకలతో సహజీవనం చెయ్యటం నాకు సాధ్యంకాదు' అన్నాను.

'కావాలంటే యింకో యింటికోసం ప్రయత్నించవచ్చునుకో. కాని కేవలం వాటికోసమే యిల్లు మార్చాలా !' అన్నారు.

నాకు చాలా చీకా కనిపించింది. "ఏమిటీయన మరీ సన్న్యాసిలాగా! దేనికీ అసహ్యం లేదు. అందరు మగవాళ్ళలాగా పిల్లలు పసిగా వున్న ప్పుడు బట్టలు పాడుచేసినా చీదరించుకోలేదు. అసలు అసహ్యం అనేది తెలీదు. 'వట్టి సన్న్యాసి' " అనుకున్నాను కోపంగా.

శారద కిష్టుడిచేత నీళ్ళబకెట్ పట్టించుకొచ్చింది. ఇంకేమన్నా సహాయం చెయ్యటానికి ఎదురుచూస్తూ నిలుచుంది. పాపం, యిందాక దాన్ని కసిరేశాను కదా అని జాలి కలిగింది. సీతా, శాయిలూ నేనేం చెప్పినా వినకుండా లక్ష్యం లేకుండా వాళ్ళ ఆటల్లో మునిగి వుంటారు. అన్నీ వాళ్ళనుకున్నట్లే జరగాలి. లేకుంటే నానా రభసా చేస్తారు. శారద మాత్రం పిలవగానే ఆటలు వదిలేసి పరుగెత్తుకొస్తుంది 'ఏమిటమ్మా' అంటూ. దాని విధేయత చూస్తే వెంటనే నాకు కసరబుద్ధి వేస్తుంది. కసి రినా అది మాట్లాడదు. ఏమిటీ అన్యాయం ? అని అడగదు. అది ఏడ్చినా ఎదురుతిరిగినా ఒప్పుకోగలను. కాని అది అన్నీ మింగేసుకుంటుంది. చిన్నవాళ్ళను దగ్గరకు తీసుకున్నట్లు దాన్ని తీసుకోలేను. ఆ మింగేసు కోవటమే, ఆ సంబంధం లేకపోవటమే చీకాకు కలిగిస్తుంది నాకు. శారదకు అన్యాయం చేస్తున్నానని తెలిసినా, ఎంత నిగ్రహించుకొందా

మనుకున్నా, తీరా సమయం వచ్చేసరికి దాన్ని కసిరేస్తాను, ఎందుకో. తరువాత పశ్చాత్తాపం కలుగుతుంది. కాని మళ్ళీ సమయం వచ్చేసరికి అంతా మొదలు!

'సీతా శాయిలూ ఏం చేస్తున్నారో చూడుపో అమ్మా' అని శారదతో నెమ్మదిగా — ప్రేమగా అని సంతోషిస్తుంది అది — చెప్పాను. సంతోషంగా వెళ్ళింది అమ్మ చెప్పిన పని చెయ్యటానికి. 'ఇహమీదట దాన్ని వూరికే కోప్పడకూడదు' అనుకున్నాను.

కిష్టుడు బకెట్ అక్కడపెట్టి ఎప్పుడో పారిపోయాడు దొంగ వెధవ! — కడగాల్సి వస్తుందని. వాడిదంతా తప్పించుకు తిరిగే వ్యవహారమని రాగానే కనిపెట్టేశాను. వాడిని పిలిచి మరీ కడిగించాను ఆ రోజు.

* * *

రోజులు గడుస్తున్న కొద్దీ కిష్టుడి సంగతి బాగా తెలిసివస్తూవుంది. వాడికి పధ్నాలుగేళ్ళు. ఒక్క వుద్యోగంకోసం వయసులో పెద్దవాళ్ళెందరో మాయింటి చుట్టూ తిరుగుతూ ప్రాధేయపడుతూ వున్నారు. ధరల పెరుగుదల వలన, యీ ప్రాంతాల ముఖ్యవృత్తి అయిన నేతపని మూలబడిపోవటాన యీ జవాను వుద్యోగం — తొంభై రూపాయిల సంపాదన — వాళ్ళ ప్రాణానికో పెద్దవరంగా కన్పిస్తోంది. పరిస్థితులలా వుండగా యీ పధ్నాలుగేళ్ళవాడూ పనిలో ఎలా దూరేశాడో అని నా కాశ్చర్యం కలుగుతుంది. బ్రతుక నేర్చినవాడు కిష్టుడు! పోనీ, పని సరిగా చేస్తాడా అంటే అదీ లేదు. తప్పించుకునే విద్య వాడికి పుటకతోనే అబ్బింది. చదువు చూద్దామా అంటే తెలుగు వ్రాయనుకూడా సరిగా రాదు.

'బడికి వెళ్ళి చదువుకోకుండా యీ పనిలో ఎందుకు చేరావురా అప్పుడే' అనడిగాను.

'బడికి పంపించాలని మా అయ్య సూశాడండి గాని నేను లొంగలా. తిరిగి సెడిపోతానని యిందులో జేర్చాడు....సదువు నా కబ్బదండి. యిదే బాగుంది' అన్నాడు.

ఆ బడికి పంపిన వైనం వాడు చెబుతుంటే వినటం తమాషా. వాడి అయ్యకు కళ్ళు కనబడవు. ఎండలో కూలిపనిచేసి కనబడకుండా పోయాయని అంటాడు వాడు. కిష్టణ్ణి కోప్పడి, కొట్టి బళ్ళోకి తీసుకపోయి, లోపల ఒదిలి, వాడి నాయన వెనక్కు తిరుగుతూనే వీడూ వెనక్కు తిరిగి వెనుకనే నడిచి వచ్చేస్తాడట. 'మా అయ్యకి సూపు లేదుగా, ఎనక్కి తిరిగి సూసినా నాపాటికి నే నొస్తావుంటే కనిపెట్టలేడండి' అని పడీ పడీ నవ్వుతూ చెప్తాడు. వాడి కళ్ళల్లో కొంటెతనం తళతళా మెరుస్తుంది. వాడిని చూస్తే ముచ్చట వేస్తుంది నాకు.

మరొక రకం వాళ్ళుంటారు. తండ్రి గుడ్డితనాన్ని గురించి అలా నవ్వలేరు. ఆ గుడ్డితనపు భారమంతా తమమీదే వున్నట్టు అంగీకరిస్తారు. అట్లాంటి తండ్రిని మోసం చెయ్యటం కలలోకూడా తలపెట్టరు. కాని అలాంటి వాళ్ళు నాకు నచ్చరు. రక్తమాంసాలుండి తమదైన ప్రత్యేక జీవితాన్ని ఆశించి అనుభవించే మనుష్యులు కారు వాళ్ళు. కిష్టుడు సిసలైన మనిషి. అందుకే వాడి తలాయించే వేషాలకు కోపం వచ్చినా, వాడి చేష్ట లకు ముచ్చట కలిగి ఆ మాట ఒదిలేసుకుంటాను.

కిష్టణ్ణి కాకుండా యింకో మనిషినికూడా యింటిపనికి వేసుకో వచ్చును మేము. ఆ వుద్యోగం కోసరం ఎందరో యింటిచుట్టూ తిరుగు తున్నారు. ఇంకా ఎవరినీ ఎన్నుకోలేదు ఆయన. వేళాపాళా లేకుండా

మాటి మాటికి ఒక్కోరు తలుపు తట్టటం, వుద్యోగంకోసం ప్రాధేయ
పడటం....చాలా న్యూసెన్సుగా వుంది.

ఆ రోజు మధ్యాహ్నం నిద్రపోయి ఆలస్యంగా లేచాను. కిష్టు
డింకా యింటినుండి రాలేదు. పనిమనిషి ఒస్తోందేమోనని చూడటానికి
వాకిట్లోకి వెళ్ళాను. బయట పదిహేడేళ్ళ కుర్రవాడు అరుగుమీద కూర్చుని
వున్నవాడు నన్నుచూసి గభాల్న లేచి నిల్చొని నమస్కారం చేశాడు. శుభ్ర
మైన బట్టలు వేసుకొని మొహాన విభూతి పెట్టుకొని బుద్ధిమంతుడిలాగా
వున్నాడు.

'అమ్మా, వుద్యోగం ఒకటి ఖాళీగా వున్నదని తెలిసి అయ్యగారి
నడుగుదామని వచ్చాను' అన్నాడు. రోజుకి నలుగురు యీ పనిమీదనే
వస్తున్నారు. మామూలు కథేనన్నమాట.

'ఏం, అయ్యగారిని యింట్లోనైనా కాస్త ప్రశాంతంగా వుండనివ్వ
దలచుకోలేదా ? ఆఫీసుటైంలో అక్కడికే పోయి అడగరాదా' అన్నాను.
ఒక్కనిముషం తటపటాయించి 'సరేనమ్మా' అని వినయంగా నమ
స్కారం చేసి వెళ్ళిపోయాడు. ఇంకా ప్రాధేయపడకుండా అంతటితో
ఒదిలినందుకు కొంచెం ఆశ్చర్యపడి లోపలికి వచ్చేశాను.

ఈ రామయ్యకే వుద్యోగం వచ్చింది. మరునాడు వచ్చి వినయంగా
నమస్కారం చేశాడు. 'నీ కిచ్చారా వుద్యోగం !' అన్నాను. 'అవునమ్మా'
అంటున్న అబ్బాయి మొహంలో కృతజ్ఞత కొట్టవచ్చినట్లుగా కన్పడు
తోంది - అ వుద్యోగం ఏదో నా దయవల్ల వచ్చినట్లు !

ఏ పని చెప్పినా వినయంగా చేస్తాడు. ఈ పని చేద్దామనిగాని
ఆ పని తప్పించుకుందామనిగాని రామయ్యకు ఆలోచనే రాదు. నా మన
సులో వుండే వూహనే కనిపెట్టి పట్టుకొని, దాని ప్రకారం చెయ్యాలని కాచు

కున్నట్లుగా కనపడతాడు. ఆ ఆతృతచూస్తే నాకు విసుగేకాదు, అసహ్యం కూడా కలుగుతుంది. 'వీడు బొద్దింకల జాతి' అనుకున్నాను.

ఒకసారి శాయిలుబాబు దొడ్డికి వెళ్ళివచ్చినప్పుడు నేను పనిలో వుండటంచూసి తానే కడగటానికి వెళ్ళాడు. ఇట్లాంటి పనులు నా పిల్లలకి ఎవరైనా చెయ్యటం నాకు బాగుండదు. 'అక్కర్లేదు, వుండు. నేను వస్తున్నాను' అన్నాను. 'ఫరవాలేదు లేమ్మా' అన్నాడు. 'ఏమిటీ ఫరవాలేదు! పనిమనిషి నాగమ్మకు కూడా యీ పని చెప్పను నేను.... వెళ్ళు' అన్నాను. మాట్లాడకుండా నీళ్ళచెంబు అక్కడ పెట్టేసి వెళ్ళిపోయాడు.

వంటయింట్లోకి వెళితే అక్కడ ఒక బొద్దింక వుల్లిపాయకోసం వచ్చి తారట్లాడుతోంది. చీపురు తీసుకుని ఫట్‌మని కొట్టాను. దాంట్లోంచీ తెల్లని చీములాంటిది బయటకు వచ్చింది. ఆ చీమును చూసి ఒళ్ళు జలదరించింది. పాడు బొద్దింకకు రక్తం వుండదు. దేన్నయినా తిని అరిగించుకొనేది యీ చీమే కాబోలు! బొద్దింకకు అది చాలా అవసరమైనదీ, రక్తంకంటే మంచిదీ! భూమిమీద మనిషి లేకుండా పోయినప్పుడు బొద్దింకను సజీవిగా నిలుపబోయేదీ కావచ్చు! కాని....నా దృష్టిలో అది పరమాసహ్యకరమైన చీము!

* * *

'కిష్టా....కిష్టా....బాత్‌రూమ్‌లో నీళ్ళు పొయ్యరా' అని కేక పెట్టాను. రామయ్య పరుగెత్తుకుంటూ వచ్చాడు.

'కిష్టుడిని మీరు సినిమాకు వెళ్ళమన్నారని అప్పుడే వెళ్ళిపోయాడమ్మా' అన్నాడు.

'అంటే చెప్పకుండా యింతముందుగానే వెళ్ళమన్నానా ?....సరే నీవు వెళ్ళి పిల్లల్ని స్కూలునుండి తీసుకురా' అన్నాను. రామయ్య వెళ్ళిపోయాడు.

కిష్టుడు యింతవరకూ యిక్కడే వుండి ఆఫీసులో క్రొత్త వుద్యోగం ఖాళీవచ్చిన విషయమూ, అది తనకే యిప్పించవలసిన అగత్యం గురించీ చెప్తూ వున్నాడు. 'ఏరా, యిక్కడ వుండటం నీకు బాగాలేదా ? ఎప్పుడూ పిల్లలతో కలిసి ఎగురుతూ వుంటావు, యింకేంపని చెయ్యకుండా....' అన్నాను నవ్వుతూ. 'ఆ వుద్దేగం యిచ్చినా జీతం పెరుగుద్ది గాని పని యీడనే సెయ్యొచ్చు' అన్నాడు ధీమాగా. వాడి అయ్యకు కళ్ళు కన బడటం లేదు. పనిలోకి పోలేకుండా వున్నాడు. వీడు ఒక్కడే కొడుకు. తల్లి రోగిష్టిది. పాతిక రూపాయిలు జీతం ఎక్కితే యింట్లో వుండే ముగ్గురికి తిండికి జరుగుతుంది, లేకపోతేలేదు. కాబట్టి ఆ వుద్యోగం వాడికి చాల అవసరం....ఇంతా చెప్పినవాడు భయంలేకుండా నాతో చెప్ప కుండానే సినిమాకు పరుగెత్తాడు - నీళ్ళు పొయ్యటం తప్పించుకోవటానికి!

వీడి ఆగడం గురించి ఎదురింట్లో లెక్చరరుగారి భార్యకూడా చెప్పింది. ఆమె దగ్గర దేనికైనా కావాలని పావలా అర్ధా యిప్పించు కొంటూ వుంటాడట. నేను వీడిని బజారుకు పంపినప్పుడు ఆమె కూడా ఏదైనా తీసుకురమ్మని పని చెప్తూ వుంటుంది. 'సంపాదించుకోనీ చిన్న వెధవ' అని నేనూ చూసీ చూడనట్లు వూరుకున్నాను. ఓసారి వాడూ వుండగానే ఆమె అన్నది - 'మీ కిష్టుడికి పొగరు ఎక్కువవుతూ వుందండి. నేను మేడమీద నిద్రపోతుంటే పిలువగానే పలకలేదని ప్రక్క నున్న పున్నాగచెట్టు పైకెక్కి పై కిటికీలోంచి కేకలువేసి లేపాడు. భయ పడిపోయాననుకోండి....యింతా చేసి ఎందుకంటే వాడికి సినిమాకు పావలా కావాలని! ఆమె కోపంగానే చెప్పాలనుకున్నా మాట బయటికి

వచ్చేసరికి నవ్వు వచ్చేసింది. 'మొన్న ఏం చేశాడనుకున్నారు! మీరు జల్లెడ పదణాలకు తెప్పించారు గదా. బాగుందని అదేమాదిరి జల్లెడ తెమ్మన్నాను. పన్నెండణాలకు తెచ్చాడు. ఏమిరా అంటే ధర ఎక్కింది అన్నాడు' అన్నది.

అక్కడే వున్న కిష్టుడికి ఆమె నాతో యిదంతా చెప్పటం నచ్చ లేదు. 'అయితే సామాన్లు మా అమ్మగారికీ ఒకటే ధర మీకూ ఒకటే అంటే ఎట్లా కుదురుతుందండీ' అన్నాడు ఏ మాత్రం తొణక్కుండా. వీడి ఆగడానికి అంతు కనబడ్డం లేదు. ఇప్పుడు నీళ్ళు పొయ్యకుండా సినిమాకు పరుగెత్తాడు.

రామయ్య పిల్లల్ని తీసుకొని వచ్చాడు. వాళ్ళు బొమ్మలు ముందే సుకుని కూర్చున్నారు.

'నీకీ వుద్యోగం ఎలా వచ్చింది రామయ్యా' అన్నాను వూసుపోక.

'అమ్మా, ఆనాడు అయ్యగారిని కలుసుకోవటానికి వస్తే మీరు యింట్లో అడిగితే బాగుండదనీ ఆఫీసులో అడగమనీ చెప్పినమీదట అయ్యగారిని ఆఫీసులో కలుసుకొన్నాను. నా కష్టసుఖాలు చెప్పుకున్నాను. వుద్యోగం యిచ్చారు' అన్నాడు. వుద్యోగం తనకు యిప్పించటానికి తగిన సలహా యిచ్చి నేను మేలు చేసినట్లు! అయ్యగారికి నేను రికమెండు చేశాననికూడా అనుకొంటున్నాడో ఏమో! కృతజ్ఞత త్యాగం వగైరాలంటే నాకు చెడ్డ చీకాకు.

'ఇంతకుముందు ఏం పనిలో వుండే వాడివి?' అన్నాను.

'నేను ఆరో క్లాసులో వుండగా చదువు మానిపించి కోమటికొట్లో గుమాస్తాగా చేర్పించారు. అప్పటినుండీ అదే పనిలో వున్నానమ్మా'

'అందులోనే వుండిక యిక్కడి కెందుకొచ్చావ్ ?' అనడిగాను.

'అక్కడ జీతం యాభై రూపాయలే యిస్తుండేవారు. అక్కడ నా తమ్ముణ్ణి పెట్టి యిక్కడ చేరాను' అన్నాడు.

'నీ తమ్ముడి కెన్నేళ్ళు ?'

'పధ్నాలుగు'

'పద్దులపని బాగా చేస్తున్నాడా ?'

'వాడికి శ్రద్ధ తక్కువమ్మా. ఇక్కడనుండి వెళ్ళాక నేను వెళ్ళితే వాడికి సహాయం చేస్తాను' అన్నాడు.

'ఆరో క్లాసులో చదువెందుకు మానేశావ్ ?'

'చదువంటే నాకు చాలా యిష్టమమ్మా....కాని వీలుపడలేదు. మా నాయనకు నేతపని వృత్తి. మేము ఎనిమిదిమంది పిల్లలం. మా నాయన తెల్లవారు ఝామున ఎప్పుడు మగ్గాలముందు కూర్చుంటాడో చీకటిపడ్డాక లేస్తాడు. వెలుతురు మొహం చూసేపనే లేదమ్మా....ఎంతచేసినా భోజనానికి జరగలేదు....యిప్పుడు కూడా జరుగుబాటు కష్టంగానే వుంది'

'అంతా నీవే మొయ్యాలని ఎక్కడుంది ? ఎలాగో హైస్కూలు వరకూ నెట్టివుండొచ్చు, నిజంగా చదువంటే ప్రీతివుంటే....' అన్నాను.

'నేనూ చదవాలనే అనుకున్నానమ్మా. కాని మా నాయన నన్ను పిలిచి 'నీవు అందరిలో పెద్దవాడివి. నీ వెట్లాచేస్తే నీ తరువాతివాళ్ళూ అట్లానే చేస్తారు. నీవు మాటవినకుండా చెడిపోతే వాళ్ళూ అంతే అయిపోతారు.... నీ బాధ్యత తెలుసుకో' అన్నాడు. అందుమీదట చదువు మానేశాను....' అన్నాడు రామయ్య.

బొద్దింక! అనుకున్నాను. కోపం, అసహ్యం కలిగాయి. బాధ్యత అంటూ బరువుమోస్తూ తనకేవీ ప్రత్యేకమైన ఆశలూ కోరికలూ లేని - రక్తంలేని జీవి! తమ్ముడికి శ్రద్ధలేదని వాడిపని చేస్తున్నాడు. క్రమంగా అందరిపనీ చేస్తాడు! ఏ పనైనా చేస్తాడు!

'నీ యంత తెలివిమాలిన వాళ్ళుండరు మరి' అన్నాను విసుగ్గా.

నా మాట అర్థం కానట్లు చూశాడు. అవును మరి. ఎలా అర్థం అవుతుంది? తనచేత తండ్రి ఒక గాడిద బరువును మోయిస్తున్నాడనీ, అది తనలోని ఆశలను వ్యక్తం చేసుకోలేక పోవటంవలన, తిరుగుబాటు, స్వయంప్రజ్ఞ ఏమీ లేకపోవటంవలన జరుగుతున్నదనీ గ్రహించలేడు. తనకు జీవితంలో ఏదో తనదైన ఒక ఆశ, ఒక లక్ష్యం లేకపోవటంవల్ల ననే సంభవిస్తోందని తెలుసుకోలేడు! తనలాంటి వాళ్ళంటే తల్లిదండ్రు లకుకూడా అలుసే నని కనుక్కోలేడు!

ఆరోజు రాత్రి భోజనాలదగ్గర ఆయన అన్నారు. 'ఆఫీసులో ఒక ఖాళీ వచ్చింది. మన కిష్టుడినైనా రాముడినైనా వేద్దామనుకుంటున్నాను. పాతిక రూపాయలు జీతం ఎక్కువ వస్తుంది. కిష్టుడు వచ్చి తాను సీనియర్ని అని చెప్పివెళ్ళాడు. రామయ్య పెద్దవాడు, పనిబాగా చేస్తాడు....' అన్నారు.

రామయ్య అడగనైనా లేదు! కిష్టుడు, పిచ్చి వెధవ, ఆశపెట్టుకున్నాడు. సంతోషిస్తాడు.

'కిష్టుడు పాపం ఆశపడుతున్నాడు' అన్నాను.

'ఇదేం తాయిలం అనుకున్నావా? పని జరగటం ముఖ్యం' అన్నా రాయన నవ్వుతూ.

ఉల్లిపాయల దగ్గరే తిరుగుతూ వుంది ఒక బొద్దింక అవి తనవే నన్న ధీమాతో! దాన్నే చూస్తూ వున్నాను, పరధ్యానంగా.

కిష్టుడికి వుద్యోగం రాలేదు! రామయ్యకే యిచ్చారు.

ఎందుకో నా చిన్నతనం జ్ఞాపకం వచ్చింది. తోటి వాళ్ళందరూ హాయిగా ఆడుకునే సమయంలో నన్ను యింట్లో చదువుకొమ్మని నిలిపేది అమ్మ. డ్యూటీ ఫస్ట్. డ్యూటీ నెక్స్ట్, డ్యూటీ ఆల్‌వేస్! ఏమైనా అభిప్రాయం వ్యక్తం చెయ్యబోతే 'నాపసాని కబుర్లు చెప్పకూడదు' అనేది. 'నిరాడంబరత' అనే పేరుతో ఒక తాను బిస్కీరంగుగుడ్డ తీసుకొని అందరికీ గుడ్డలు కుట్టించి పడేసేది. నా మనసు మెత్తని పూల సిల్కు గౌన్ల మీద వుండేది ....

శ్రీకృష్ణుడు గొప్పవాడని నేనూ, శ్రీరాముడు గొప్పవాడని సరళా - మా యిద్దరికీ ఎప్పటికీ ఎడతెగని వాదం వుండేది. శ్రీ రాముడంటే నాకు తగని కోపం.........

....కిష్టుడికి వుద్యోగం రావాలి. వస్తే సంతోషిస్తాడు. రామయ్యకు వచ్చినా వాడికి సంతోషించటం తెలీదు. కాని కిష్టుడికి రాలేదు. రాకపోవటం చాల అన్యాయం!

ఇంకా ఉల్లిపాయల దగ్గరేవుంది ఆ బొద్దింక - నున్నగా, ఓవల్‌గా, బిళ్ళలాగా, చెక్కుచెదరకుండా.

మనుష్యులుపోయి బొద్దింకలే బ్రతకటం సాధ్యమా? కావచ్చు. కాని....కాని....తెలివిగల మనిషి చివరికి మిగిలేది బొద్దింకేనని గ్రహించి తానే బొద్దింక అయి మిగులుతాడేమో!

ఎంత ఘోరం!